నిర్లక్ష్యంతో మూతపాడి..

- నిరుపయోగంగా బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్
- తుప్పుపడుతున్న యంత్రాలు
- పట్టించుకోని అధికారులు



తొండంగి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మూతపడిన ఏపీ డెయిరీ బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్



బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్‌లో తుప్పుపడుతున్న విలువైన యంత్ర సామగ్రి

తొండంగి: పాడి రైతులకు ప్రోత్సాహం కరవైంది.. వారి కోసం ఏర్పాటైన ఏపీ డెయిరీ బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ నిరుపయోగంగా తయారైంది. దీంతో తొండంగి మండలంలోని పాల ఉత్పత్తిదారులంతా ప్రైవేట్ డెయిరీలకు పాలుపోయాల్సిన పరిస్థితి వచ్చింది. వ్యవసాయపరంగా, పాడి పరిశ్రమ పరంగా తొండంగి మండలానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మెట్ట, పల్లపు ప్రాంతాల్లో పాల ఉత్పత్తి ద్వారా పేద, మధ్యతరగతి రైతులు కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరికోసం గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న రాజా అశోక్‌బాబు పాడి రైతులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో 2012-13 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఏపీ డెయిరీ ద్వారా ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ద్వారా రాష్ట్రీయ కృషి వికాష్‌యోజన నిధులు రూ.30 లక్షలతో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్‌ను నిర్మించేందుకు ప్రతిపాదించారు. పట్టుదలతో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేశారు. తొండంగి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఐకేపీ భవనం నిరుపయోగం ఉండటంతో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్‌ను నిర్మించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014లో ఈ సెంటర్‌ను ప్రారంభించారు. కాగా దీని ద్వారా రావికంపాడు, ఏవీ నగరం, చిన్నాయపాలెం, బెండపూడి, సీతారాంపురం, కొత్తపల్లి, కొమ్మనాపల్లి, తొండంగి, గోపాలపట్నం, తుని మండలం తిమ్మాపురం గ్రామాల నుంచి సుమారు 500 నుంచి వెయ్యి లీటర్ల పాలు వచ్చేవి. దాదాపు మూడొందల మంది రైతులు సభ్యులుగా ఉండగా, ఒక్కో గ్రామం ఒక్కో సొసైటీగా పది సొసైటీలు ఏర్పడ్డారు. నాబార్డు ద్వారా వీరికి ఏపీ డెయిరీ అధికారులు రాయితీపై బ్యాంకు రుణాలను కూడా ఇప్పించారు. ఓసీ, బీసీలకు రూ.లక్ష రుణానికి రూ.25 వేల రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.33 వేలు రాయితీగా ఇచ్చే ఈ రాయితీ కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా రైతులకు ఇవ్వాల్సి ఉంది. అప్పట్లో డైరీ మేనేజర్‌గా వ్యవహరించిన వ్యక్తి పలు అవకతవకలకు పాల్పడటంతో దీనికి సంబంధించిన రాయితీ సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమకాక క్రమంగా రైతులంతా బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అప్పట్లో వెన్నశాతాన్ని బట్టి లీటరుకు రూ.52.60 ఇచ్చేవారు. సెంటర్‌లో పనిచేసిన సిబ్బందికి కూడా జీతాలు కూడా అందని పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో నిర్వహణ పక్కదారి పట్టడంతో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ మూతపడింది. దీంతో సెంటర్లో ఎంతో విలువలైన మిల్క్ కూలింగ్ యంత్ర సామగ్రి తుప్పుపట్టి పాడవుతోంది.

ప్రైవేట్ డెయిరీల హవా

మండలం వ్యాప్తంగా మెట్ట, పల్లపు ప్రాంతాల్లో సరాసరిన రోజుకు మూడు వేల నుంచి ఐదు వేల లీటర్ల వరకూ పాల ఉత్పత్తి జరుగుతుంది. ఏపీ డెయిరీ సెంటర్ మూతపడిన నేపథ్యంలో రైతులంతా ప్రైవేట్ బాట పట్టారు. దీంతో ప్రైవేట్ సంస్థలు రైతులకు ప్రోత్సాహకాలను కూడా అందిస్తున్న నేపథ్యంలో రైతులు వాటిపైనే మొగ్గుచూపుతున్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కొద్దిపాటి సామగ్రితో నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. తొండంగి గ్రామానికి రైతు భరోసా కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణానికి పక్కనే ఉన్న సోషల్ వెల్ఫేర్ హాస్టల్ శిథిల భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా గోడలు కూలిపోయాయి. ప్రమాదకర పరిస్థితి ఉన్న హాస్టల్ భవనంలోనే బిక్కుబిక్కుమంటూ రైతు భరోసా కేంద్రాన్ని సాగిస్తున్నారు. అయితే కొంతకాలం క్రితం బల్క్‌మిల్క్ సెంటర్‌గా నిర్వహిస్తున్న భవనంలో వ్యవసాయశాఖ వినియోగించుకునేది. మళ్లీ అదేవిధంగా రైతు భరోసా కేంద్రానికి ఈ భవనాన్ని కేటాయిస్తే రైతులకు సౌలభ్యంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం



శిథిలమైన హాస్టల్ భవనంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్‌ను తొలగించి వ్యవసాయ శాఖకు అప్పగించాలని ఇప్పటికే ఉన్నతాధికారులను కోరాం. అనుమతులు వస్తే రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు వంటి సురక్షితంగా నిల్వ చేసి సరఫరా చేసేందుకు సరైన గొడౌన్ ఏర్పాటవుతుంది.

–ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి

బంద్ విజయవంతానికి పిలుపు



శంఖవరంలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ ప్రతినిధులు

శంఖవరం: జులై 9న జరిగే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లక్ష్మబాబు కోరారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉండాలని, కార్మికులకు రోజూ రూ. 600 కూలి ఇవ్వాలని, కార్మికులు, కర్షకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతలూరు కమిటీ కార్యదర్శి దాడి నాగేశ్వరరావు, దుమ్ముల సింహాచలం, తాడి లక్ష్మణరావు, జంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

తొండంగి: ఎ.కొత్తపల్లిలో శుక్రవారం ఓ పూరిల్లు కాలిపోయింది. ఇక్కడి ఎస్సీపేటలో శివకోటి అప్పారావు, అతని భార్య మరియమ్మ పూరింటిలో నివాసం ఉంటున్నారు. ఉదయం ఇంటి పైకప్పు నుంచి మంటలు రావడంతో గమనించిన ఇంట్లో నుంచి వారు బయటకు వచ్చేశారు. స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో ఇంట్లో రూ.20 వేలుతోపాటు గృహోపకరణాలు కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని గ్రామ వీఆర్వో వెంకటలక్ష్మి పరిశీలించారు.

క్లుప్తంగా

పాహిమాం.. కనకదుర్గమ్మా



మామిడి పండ్ల అలంకరణలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మను శుక్రవారం మామిడి పండ్లతో అలంకరించారు. పవిత్ర వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు సహకారంతో అమ్మవారిని 1,116 మామిడి పండ్లతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మామిడి పండ్లు నివేదించారు. అనంతరం అమ్మవారికి అలంకరించిన మామిడి పండ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఉచిత వైద్య శిబిరం

గోకవరం: గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థలో పని చేసే ఉద్యోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర ఆస్పత్రి డాక్టర్ సుధీర్, సిబ్బంది పాల్గొని 141 మందికి వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, ఈజీసీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అస్సాగో ప్రతినిధి ఈడీజీ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వివేక్‌కుమార్ శుక్లా, హెచ్ఆర్ చంద్రశేఖర్, ఏఎస్ఓ భవానీశంకర్, హెచ్ఎస్ఈ సూర్యస్వామి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న రామకృష్ణను అరెస్ట్ చేసిన పోలీసులు

జగ్గంపేట: స్థానిక శివారు పోలవరం కాలువ సమీపంలో మోటారు సైకిళ్లు చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునందనరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగ్గంపేట వద్ద పోలవరం కాలువ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, గంగవరం మండలం రామదేవపురం గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణ (22) అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అరెస్టు చేసి ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ మోటారు సైకిళ్లు చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, నిందితుడిని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

కుట్టు శిక్షణతో ఆసరా

తుని రూరల్: కుట్టు శిక్షణ మహిళలకు ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శుక్రవారం తుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వీరికి 90 రోజుల శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం టి.తిమ్మాపురంలో ప్రజాదర్బారు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి, ఏఎంసీ చైర్మన్ కృష్ణారావు, ఎంపీడీఓ కె.సాయి నవీన్ పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ సోమవారం వికాస కార్యాలయలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో టెక్నికల్ సపోర్టు ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్, మోడిన్ థర్మల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అప్రెంటిస్, కేఎఫ్‌సీలో టీమ్ మెంబర్స్, ఇండో ఎంఐఎం, హుందాయ్ గ్లోవీస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజన వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ ఈ నెల 19వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు.

వ్యక్తికి గాయాలు

కాకినాడ రూరల్: కాకినాడ - పిఠాపురం మార్గంలో తిమ్మాపురం వై జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెల్లవారు జామున ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారని, ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదని రైటర్ ఆలీషా తెలిపారు. గాయపడిన వ్యక్తి చేతిపై సాధనాల యర్ర అప్పన్న అని పచ్చబొట్టు ఉందని కేసు నమోదు చేసినట్టు తిమ్మాపురం అదనపు ఎస్సై మూర్తి తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పనులు కల్పించండి



వెదురుపాకలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ నాగేశ్వరరావు

గోకవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని జిల్లా డ్వామా పీడీ ఎ.నాగేశ్వరరావు అన్నారు. వెదురుపాక పంచాయతీ పరిధి అప్పన్న చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లపై వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. వేతనదారులు పీఎమ్ఎస్‌బీవై, పీఎమ్‌జేజేబీవై, ఈ-శ్రామ్ వంటి బీమా పథకాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏపీఓ శేషఅప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నవ ధాన్యాల పంటలతో మేలు



సాగు గురించి వివరిస్తున్న జిల్లా ప్రాజెక్టు అధికారి ఇలియాజర్

ప్రత్తిపాడు: నవధాన్యాల పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చి మేతగా ఉపయోగపడతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారి జె.ఇలియాజర్ తెలిపారు. పలు రకాల పంటల సాగుతో అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఎలియాజర్ పర్యవేక్షణలో ప్రకృతి సాగు సిబ్బంది లంపకలోవ గ్రామంలో శుక్రవారం ఎకరం మేర విస్తీర్ణంలో పది కిలోల 31 రకాల విత్తనాలను ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో చల్లారు. ప్రకృతి సాగుకో ఆర్డినేటర్ గణేష్, ఎన్ఎఫ్ఏ అప్పలనాయుడు, ఎంటీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై పట్టు సాధించాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ తరగతులకు వచ్చిన విద్యార్థులు

ఏలేశ్వరం: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గణితంపై అవగాహన ఉంటే మంచి మార్పులు సాధించవచ్చన్నారు. అనంతరం కథలు చదవడం, రాయడం, పద్యాలు చదివి భావాలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఘనంగా అన్నసమారాధన

గండేపల్లి: జెడ్.రాగంపేట పరిధి ఆంధ్రాబ్యాంక్ సమీపంలో సోమాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ వైస్ ఎంపీపీ మారిశెట్టి భద్రం, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, జేవీఆర్ అధినేత జీను మణిబాబు, రామవరం మాజీ ఉప సర్పంచ్ అడబాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భారతీయ ధర్మపరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆలయ కమిటీ సభ్యుడు ముమ్మిడివరపు లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికంగా ఎదగాలి

గోకవరం: ప్రతి మహిళా పారిశ్రామికంగా ఎదగాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం వెలుగు భవనంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీఓ గోవిందు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని ఎనిమిది ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. పెద శంకర్లపూడిలోని ఆమె స్వగృహంలో శుక్రవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల విద్యాశాఖాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 60 పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పు చేశామన్నారు.

దుర్గామాతలకు చండీహోమాలు



కనకదుర్గమ్మ వారికి చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గమ్మకు శుక్రవారం సందర్భంగా, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గమ్మకు అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా చండీహోమాలు ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. తరువాత అమ్మవార్లకు వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. వేదపండితులు వేదుల సూర్యనారాయణ, గొల్లపల్లి గణపతి ఘనాపాఠీ, చిట్టి శివ, అర్చకులు దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, చిట్టెం గోపాల్, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమాలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు. వనదుర్గ అమ్మవారి చండీ హోమంలో 40 జంటలు రూ.750 టిక్కెట్‌తో ప్రత్యక్షంగా, మరో భక్తుడు ఆన్‌లైన్‌లో రూ.750 రుసుం చెల్లించి పరోక్షంగా పాల్గొన్నారు. ఐదుగురు భక్తులు కనకదుర్గమ్మ వారి చండీ హోమంలో పాల్గొన్నారు. కాగా, శుక్రవారం సందర్భంగా సత్యదేవుని దేవేరి శ్రీఅనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కనకదుర్గ అమ్మవారికి రుత్విక్కులు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు సుధీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ల త్యాగం అజరామరం



తునిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దివ్య, మహిళలు



గోకవరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నాయకులు జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ

తుని: దేశ భద్రతలో అసువులు బాసిన వీరజవాన్ల త్యాగాలు అజరామరం అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. శుక్రవారం తుని రాజా రాజబాబు మున్సిపల్ పార్కు నుంచి తిరంగా ర్యాలీని ఆమె ప్రారంభించారు. అంతకు ముందు బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల రత్నాజీ, మున్సిపల్ వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: ఆపరేషన్ సింధూర్ విజయోత్సవంలో భాగంగా గోకవరంలో శుక్రవారం 450 అడుగుల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు జరిగిన ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన పలువురు మాజీ సైనికులను ఎమ్మెల్యే సన్మానించారు.

ఒట్టు... కూలేట్టు



రావికంపాడు-ఏవీ నగరం రహదారిలో శిథిలావస్థకు చేరిన వంతెన



ప్రమాదకరంగా మారిన రెయిలింగ్

తొండంగి: రెండు మార్గాలను కలిపేవే వంతెనలు.. అలాంటి వారధి కూలేందుకు సిద్ధంగా ఉంది. తొండంగి మండలం రావికంపాడు నుంచి ఏవీ నగరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో పీబీసీ (పిఠాపురం బ్రాంచి కెనాల్)పై నిర్మించిన వంతెన వయసు మళ్లింది. కత్తిపూడి పాత చెక్‌పోస్ట్ జంక్షన్ జాతీయ రహదారి నుంచి రావికంపాడు, ఏవీ నగరం మీదుగా పెరుమాళ్లపురం బీచ్ రోడ్డును చేరుకునేందుకు సుమారు ఎనిమిది కిలోమీటర్లు రహదారి ఉంది. తీర ప్రాంతంలో పోర్టు, వివిధ పారిశ్రామిక నిర్మాణాలు, హేచరీలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రావెల్, సిమెంట్, ఐరన్, యంత్రాలు తదితర సామగ్రి రవాణా జరుగుతుంది. ఈ రహదారి దగ్గరగా ఉండటంతో వాహనాల రాకపోకలు జరగడం, వంతెన నిర్మాణం జరిగి అనేక ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరింది. వంతెన అడుగు భాగంలో శ్లాబ్ పెచ్చులూడి ఇనుము బయటకు కనిపిస్తుంది. వంతెనపై రెయిలింగ్ కూడా ఇప్పటికే కూలిపోయింది. అదేవిధంగా వంతెనకు ఇరువైపులా రోడ్డు కుంగిపోయింది. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు జరుగుతున్నాయి. ఇలానే ఉంటే వంతెన కూలిపోయే ప్రమాదం ఉంది. కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు, పాలకులు శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఏలేశ్వరంలో వైద్య సిబ్బంది ర్యాలీ



కొత్తపల్లిలో డెంగీ వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: స్థానిక అర్బన్ ఆసుపత్రి పరిధిలో హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమకాటు ద్వారా వస్తుందన్నారు. పరిసరాల శుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత వైద్యులు ఎస్.పూజ, మురళీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామ ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధికి కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

గోకవరం: కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిన్న జాగ్రత్త–పెద్ద రక్షణ అంటూ సిబ్బంది నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి ఇంటి బయట, లోపల దోమలు చేరి గుడ్లు పెట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రత్తిపాడు: డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు గీతాసుధ తెలిపారు. ఆ గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఆనంద్, అజయ్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వంటా వార్పుతో ఆందోళన



రాచపల్లిలో వంటా-వార్పుతో ఆందోళన చేస్తున్న యాదవ సామాజిక వర్గీయులు

ప్రత్తిపాడు: తమ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాన్ని అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు ఆక్రమించారంటూ శుక్రవారం రాచపల్లి గ్రామంలో యాదవ సామాజిక వర్గం ఆందోళన చేపట్టింది. వంటా-వార్పు చేపట్టి నిరసన తెలిపింది. గ్రామంలో 60 సెంట్ల స్థలాన్ని తమకు బహిర్భూమిగా కేటాయించారని, చాలా కాలంగా తమ ఆధీనంలోనే ఉందని యాదవులు అన్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఆ స్థలం తనదేనంటూ స్థలం చుట్టూ కంచె వేశారంటూ యాదవ మహిళా సంఘాల సభ్యులు సదరు స్థలంలో కంచెను తొలగించి, ఆందోళన చేపట్టారు. వారి ఆందోళనకు ఎంపీటీసీ బుద్ధరాజు రామలక్ష్మి, చంటిరాజు మద్దతు తెలిపారు.